సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024



హుండీ లెక్కింపు

సీతమ్మధార: విశాఖలోని సంపత్ వినాయగర్ దేవస్థానం హుండీ లెక్కించగా 33 రోజులకు రూ.20.46 లక్షలు లభించాయి.



పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్: విశాఖలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు.



మెకాన్‌తో పోర్టు ఒప్పందం

సాక్షి, విశాఖపట్నం: ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ సేవలు అందించేందుకు మెకాన్ లిమిటెడ్ సంస్థతో విశాఖపట్నం పోర్టు ఒప్పందం కుదుర్చుకుంది.

కార్యదర్శుల బదిలీల్లో 'పంచాయితీ'

పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ అంతా గందరగోళంగా తయారైంది. జనాభా, ఆదాయం ప్రాతిపదికన పంచాయతీలకు గ్రేడ్లు అప్‌గ్రెడేషన్ చేసి సీనియారిటీ ఆధారంగా కార్యదర్శుల బదిలీల ప్రక్రియ చేపట్టాలి. అలా చేయకుండా చిన్న పంచాయతీల్లో పనిచేసే సీనియర్ల(గ్రేడ్–1, 2)కు మళ్లీ అదే స్థాయి పంచాయతీలకు బదిలీ చేసుకోవాల్సిన పరిస్థితి కల్పించారు. మేజర్ పంచాయతీల్లో పనిచేసే జూనియర్ల(గ్రేడ్–3, 4, 5)కు మళ్లీ పెద్ద పంచాయతీలకు బదిలీ అయ్యే అవకాశమిచ్చారు. ఈ విధానం వల్ల సీనియర్లకు తీవ్ర అన్యాయం జరుగుతోందని పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

కె.కోటపాడు మండలంలో మండల కేంద్రంతోపాటు చౌడువాడ, ఎ.కోడూరు, రావికమతం, చీడికాడ, చోడవరం మండలంలో నర్సయ్యపేట, గాంధీగ్రామం మొదలైన పంచాయతీలు వాటి పరిధిలో గల జనాభా, ఆదాయపరంగా గ్రేడ్–1 స్థాయిలో ఉండాలి. కానీ ఆ పంచాయతీలు గ్రేడ్– 3లో కొనసాగుతున్నాయి. దీంతో ఈ పంచాయతీలకు జూనియర్ కార్యదర్శులను బదిలీ చేయడానికి అవకాశం ఏర్పడింది. ఇలా అవకతవక గ్రేడ్లతో సతమతమవుతున్న పంచాయతీలు అనేకం ఉన్నాయి.

- జీవోలో తప్పుల తడకగా గ్రేడ్లు
- జూనియర్లకు మళ్లీ మేజరు పంచాయతీల్లోనే..
- నష్టపోతున్న గ్రేడ్–1, 2, 3 సీనియర్లు
- ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో నిబంధనలకు పాతర
- మార్చాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం డిమాండ్



చోడవరం సమావేశంలో నిబంధనలకు విరుద్ధంగా బదిలీ ప్రక్రియ జరుగుతుందంటూ నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, సంఘం ప్రతినిధులు (ఫైల్)

సాక్షి, అనకాపల్లి: ఉమ్మడి విశాఖ జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ అస్తవ్యస్తంగా మారింది. జనాభా, ఆదాయం పెరిగిన పంచాయతీల గ్రేడ్లను అప్‌గ్రేడ్ చేయకుండా బదిలీలు చేపట్టారు. ఈ ప్రక్రియలో పొరపాట్లు మీద పొరపాట్లు చేస్తున్నారు. మేజర్ పంచాయతీ, అధిక జనాభా ఉన్న పంచాయతీలకు గ్రేడ్–1, గ్రేడ్–2 కార్యదర్శులను కేటాయించాలి. కానీ ఉమ్మడి విశాఖ జిల్లాలో మాత్రం అలా జరగడం లేదు. తక్కువ జనాభా ఉన్న పంచాయతీలకు సీనియర్ కార్యదర్శులు దరఖాస్తు చేసుకునేలా గ్రేడ్లను పంచాయతీరాజ్ శాఖ కేటాయించింది. నిబంధనల ప్రకారం కాకుండా తప్పుల తడకగా గ్రేడ్లు తయారు చేసింది. కేవలం స్థానిక ఎమ్మెల్యేల ఒత్తిళ్లతోనే నిబంధనలకు విరుద్ధంగా గ్రేడ్లు కేటాయించినట్లు పంచాయతీ కార్యదర్శుల సంఘాల నాయకులు, సిబ్బంది వాపోతున్నారు. పంచాయతీరాజ్ శాఖతోపాటు పలు శాఖల్లో ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గడువు తేదీని మరో 15 రోజులు పెంచిన విషయం తెలిసిందే. ఈనెల 15వ తేదీ వరకు బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏళ్ల తరబడి ఒకే స్థానంలో..

సీనియారిటీని బట్టి పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ –3, గ్రేడ్ –2, గ్రేడ్ –1కు ప్రమోషన్ పొందేవారు. వీరు మాత్రమే అధిక జనాభా గల పంచాయతీల్లో పని చేయాల్సి ఉంది. అయితే పంచాయతీల్లో గ్రేడింగ్ చేయకపోవడంతో ఏళ్ల తరబడి ఒకే స్థానంలో ఉండిపోవాల్సి పరిస్థితి ఏర్పడిందని సీనియర్లు వాపోతున్నారు.

ఐదేళ్ల పరిమితి వట్టిమాటే..

పంచాయతీ కార్యదర్శుల బదిలీ ప్రక్రియలో ఐదేళ్ల పరిమితి దాటిన వారే స్థానచలనానికి అర్హులంటూ జీవోలో పేర్కొన్నా.. అవి వట్టిమాటలగానే మిగిలిపోతున్నాయి. ఏడాది, రెండేళ్ల సర్వీసు పూర్తయిన వారు సైతం స్థానిక కూటమి పార్టీల ప్రజాప్రతినిధుల సిఫార్సులతో కోరుకున్న చోట పోస్టింగ్‌లు వేయించుకుంటున్నారు. గ్రేడ్–1, గ్రేడ్–2 పంచాయతీ కార్యదర్శులు రాష్ట్ర వ్యాప్తంగా ఏ జిల్లాలో అయినా దరఖాస్తు చేసుకోవచ్చు. గ్రేడ్–3, గ్రేడ్–4, గ్రేడ్–5 వారు సొంత జిల్లాలోనే బదిలీలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అసలు బదిలీల్లో గ్రేడింగ్ ఏ ప్రాతిపదికన ఇచ్చారో కూడా తెలియని పరిస్థితి ఉంది.

ఏ క్లస్టర్‌లో ఎంతమంది..

ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 970 పంచాయతీ కార్యదర్శులకు గానూ అనకాపల్లి జిల్లా -651 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లా- 243 మంది, విశాఖ జిల్లా- 76 మంది చొప్పున ఉన్నారు.

క్లస్టర్ - 1	కేటగిరీ - 74
క్లస్టర్ - 2	కేటగిరీ - 49
క్లస్టర్- 3	కేటగిరీ - 149
క్లస్టర్ - 4	కేటగిరీ - 280
అడిషనల్ క్లస్టర్ - 4	కేటగిరీ-47
క్లస్టర్ - 5	కేటగిరీ- 371

సీనియర్లు మళ్లీ ఏజెన్సీకి వెళ్లే పరిస్థితి...

ప్రస్తుతం ఏ గ్రేడ్‌లో పనిచేసే కార్యదర్శులు ఆ గ్రేడ్ పంచాయతీకే వెళ్లాలని జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు. దీంతో తక్కువ జనాభా గల పంచాయతీల్లో పనిచేసే సీనియర్లు మళ్లీ అదే గ్రేడ్ పంచాయతీకి బదిలీ అయ్యే పరిస్థితి నెలకొంది. పెద్ద పంచాయతీల్లో పనిచేసే జూనియర్ పంచాయతీ కార్యదర్శి.. మళ్లీ అదే గ్రేడ్ పంచాయతీకి వెళ్లాల్సి వస్తోంది. ఏజెన్సీలో 20 మినహా అన్నీ గ్రేడ్-4, గ్రేడ్-5లోనే ఉన్నాయి. అక్కడ పనిచేసే వారు మైదాన ప్రాంతానికి వచ్చే అవకాశం ఉంటుంది. అయితే గతంలో ఏజెన్సీలో పనిచేసి ఇక్కడకు వచ్చిన సీనియర్ పంచాయతీ కార్యదర్శులు గ్రేడింగ్ విధానం అస్తవ్యస్తంగా ఉండడంతో .. మళ్లీ ఏజెన్సీకి వెళ్లాల్సి వస్తోంది. ఎందుకంటే సీనియర్లయినా వారు ప్రస్తుతం చిన్న పంచాయతీల్లో ఉన్నారు. కొత్త జీవో ప్రకారం వారు వారు చిన్న పంచాయతీలకే వెళ్లాలి కాబట్టి ఏజెన్సీలో అధికంగా ఉన్న గ్రేడ్-4, గ్రేడ్-5 పంచాయతీలకు బదిలీ అవుతున్నారు. దీంతో సీనియర్లకు అన్యాయం జరుగుతోంది.

న్యూస్‌రీల్

మెరైన్ పోలీసుల మాక్ డ్రిల్

- పూడి చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న మెరైన్ పోలీసులు

అచ్యుతాపురం (మునగపాక): అచ్యుతాపురం మండలం పూడిమడక మెరైన్ పోలీసు స్టేషన్ వద్ద గురువారం సముద్రంపై గస్తీలో భాగంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. మెరైన్ ఎస్పీ వర్మ నేతృత్వంలో పూడి చెక్‌పోస్టు వద్ద ఈ మాక్ డ్రిల్ జరిగింది. తీరం వైపు వచ్చే వాహనాలను తనిఖీ చేయడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మెరైన్ సీఐ సింహాద్రినాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

11న అరసం జిల్లా మహాసభ

అనకాపల్లి: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా ప్రథమ మహాసభను ఈనెల 11వ తేదీన సాయంత్రం 6 గంటలకు స్థానిక శేఖవీధి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాదులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అవంత్స సోమసుందర్, గరిమెళ్ల సత్యనారాయణ కవితలు, కవితా స్రవంతి రెండు పుస్తకాల ఆవిష్కరణ ఉంటుందన్నారు.

రాష్ట్ర వీఆర్వోల అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడిగా శంకరరావు



కె.కోటపాడు : ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కొరువాడ గ్రామ రెవెన్యూ అధికారి పోతల శంకరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనకాపల్లిలో గురువారం వీఆర్వోల సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక జరిగింది. ఏపీ వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకాసు ఆధ్వర్యంలో సంఘ గౌరవ అధ్యక్షుడు ఈర్లి శ్రీరామ్మూర్తి పర్యవేక్షణలో జరిగిన ఎన్నికలో కార్యవర్గ సభ్యుడిగా శంకరరావును సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

యువకుడి అదృశ్యం



పవన్ ప్రసాద్ (ఫైల్)

చోడవరం రూరల్: మండలంలోని గోవాడ గ్రామానికి చెందిన నల్ల వరపు పవన్ ప్రసాద్ అనే యువకుడు అదృశ్యమయ్యాడు. గత నెల 25వ తేదీ ఆదివారం మాడుగుల మండలం కస్పాజగన్నాథపురం గ్రామానికి వెళ్లాడు. అక్కడి నుంచి తిరుగు ప్రయాణమైనప్పటికీ ఇంటికి చేరుకోలేదు. దీంతో ఈనెల 1న చోడవరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తల్లిదండ్రులు నల్లవరపు ప్రకాష్, పద్మ తెలిపారు. పవన్‌ప్రసాద్ డిగ్రీ చదివాడని, ప్రస్తుతం ఏ ఉద్యోగమూ చేయడం లేదన్నారు. ఇతని ఆచూకీ తెలిసిన వారు చోడవరం పోలీసులకు సమాచారమందివ్వాలని తల్లిదండ్రులు కోరారు.

చేపల చెరువుల నిర్వాహకులకు నోటీసులు



చేపల చెరువుల నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తున్న మత్స్యశాఖ అసిస్టెంట్ కీర్తి

దేవరాపల్లి: మండలంలో అనధికారికంగా చేపల చెరువులు నిర్వహిస్తున్నవారికి మత్స్యశాఖ అధికార్లు గురువారం నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు మండలంలోని పలు గ్రామాల్లో చేపల చెరువులను పోలీసు సిబ్బందితో కలిసి మత్స్యశాఖ సచివాలయ అసిస్టెంట్ కీర్తి పరిశీలించి, నిర్వాహకుల నోటీసులు అందజేశారు. కుళ్లిన మాంసం వ్యర్థాలతో చేపల పెంపకాన్ని చేపట్టిన, ప్రాణాంతక క్యాట్ ఫిష్‌ను పెంచిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కీర్తి హెచ్చరించారు.ఇలా ఎన్నిసార్లు అనధికారికంగా చేపల చెరువులు నిర్వహిస్తున్న యజమానులకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న మత్స్యశాఖ సచివాలయ అసిస్టెంట్ కీర్తితో వాగ్వాదానికి దిగారు. కుళ్లిన మాంసం వ్యర్థాలను తొలగించేలా చెరువుల యజమానులకు మత్స్యశాఖ అధికారులు ముందుగానే సమాచారం ఇచ్చారని వెంకన్న ఆరోపించారు.

పరిశ్రమల సహకారంతో ఏజెన్సీకి 30 వేల దోమతెరలు

- కలెక్టర్ దంపతుల చొరవతో తీరిన సమస్య



మీడియా సమావేశంలో కలెక్టర్ విజయ కృష్ణన్

సాక్షి, అనకాపల్లి: వానాకాలం వచ్చింది. దోమల బెడద విపరీతంగా పెరిగింది. వీటి ద్వారా ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లోని మూరుమూల గ్రామాల్లో సీజనల్ జ్వరాలు పెరుగుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా వీటి ప్రభావం మరింత ఎక్కువైంది. దోమల ద్వారా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాల బారిన పడి కొందరు మృత్యువాత కూడా పడుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా అనకాపల్లి, అల్లూరి జిల్లాల కలెక్టర్ దంపతులు విజయ కృష్ణన్, దినేష్ కుమార్‌ల చొరవతో రూ.66 లక్షల విలువైన 30 వేల దోమతెరలు సమకూరాయి. వీటిని అల్లూరి, అనకాపల్లి జిల్లాల్లో గల బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు, గిరిజన మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజల కోసం వినియోగిస్తున్నారు. వీటిలో 20 వేల దోమ తెరలు అల్లూరి సీతారామరాజు జిల్లాకు, 10 వేల దోమ తెరలు అనకాపల్లి జిల్లాకు పంపిణీ చేసినట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. గురువారం ఆమె కలెక్టర్ కార్యాలయంలో మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు. టోయోట్స్ ప్రైవేట్ లిమిటెడ్ 10,000, ఈసాయి ఫార్మా కెమికల్స్ 3,500, హెటెరో ల్యాబ్స్ 2,500, వేసువియస్ 2,500, అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ 2,500, డెక్కన్ ఫైన్ కెమికల్స్ 2,000, ఫోరస్ ల్యాబ్స్ 2,000, వసంత కెమికల్స్ 1,000, తనిష్ లేబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ (యూనిట్ 9) 1000, అలివిరా యానిమల్ హెల్త్ లిమిటెడ్ 1000, కాన్సాయ్ నెరోలాక్ పెయింట్స్ లిమిటెడ్ 1000, రెప్రా టెక్నిక్ 500, ఏషియన్ పెయింట్స్ 500 దోమతెరలను అందించినట్లు పేర్కొన్నారు.

గంజాయి రవాణా, రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి

- ఆకస్మిక తనిఖీలు ముమ్మరం చేయాలి
- యలమంచిలి స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ దీపిక



స్థానిక పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

యలమంచిలి రూరల్ : గంజాయి అక్రమ రవాణాను అరికట్టడం, రోడ్డు ప్రమాదాలను నివారించడంపై దృష్టి పెట్టాలని, ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. గురువారం ఆమె యలమంచిలి టౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్థానిక పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు. పలు సూచనలు చేశారు. మైనర్లు డ్రైవింగ్ చేయకుండా చర్యలు చేపట్టాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు ఎక్కువ నమోదు చేయాలని ఆదేశించారు. గంజాయి నిర్మూలనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, మద్యం బెల్టుషాపులను నిర్వహించకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఓపెన్ డ్రింకింగ్, డ్రంకెన్ డ్రైవ్ కట్టడి చేయాలని, డైనమిక్ /ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించాలని, త్వరగా పరిష్కరించాలని సూచించారు. పెండింగ్ కేసుల సీడీ ఫైల్స్‌ను పరిశీలించి కేసుల పురోగతిపై ఆరా తీశారు. ఈ నెల 14న జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా రాజీ పడదగ్గ కేసుల్లో ఇరు పార్టీలకు కౌన్సెలింగ్ చేసి, స్వచ్ఛందంగా రాజీ పడేలా చేసి తద్వారా కేసుల సంఖ్యను తగ్గించాలని సూచించారు. యలమంచిలి టౌన్ పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎస్పీ పరిశీలించారు. ఆమె వెంట పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, యలమంచిలి సీఐ ఎస్.ధనుంజయరావు, ఎస్ఐలు కె.సావిత్రి, బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గురువుల కృషితోనే ఉజ్వల భవిష్యత్తు

- కలెక్టర్ విజయ కృష్ణన్
- ఘనంగా గురుపూజోత్సవం
- ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలతో కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల, డీఈవో వెంకటలక్ష్మమ్మ

తుమ్మపాల: మంచి సమాజాన్ని నిర్మించడంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి గురుపూజోత్సవ కార్యక్రమాన్ని జీవీఎంసీ ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఆమెతోపాటు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాలో ఎంపిక చేసిన ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమసమాజ స్థాపనలో ఉపాధ్యాయులు ముఖ్య భూమిక పోషించాలని అన్నారు. తల్లిదండ్రుల కన్నా పాఠశాలల్లోనే ఎక్కువ సమయం గడపడం వల్ల ప్రతి పాఠశాలలో పిల్లలు ఉపాధ్యాయులనే రోల్ మోడల్‌గా చూస్తారన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి విద్యను అందించడంతోపాటు వారికి సత్ప్రవర్తన అలవడేలా చూడాలన్నారు. తల్లిదండ్రులు చెప్పిన విషయాలకంటే, ఉపాధ్యాయులు చెప్పిన వాటినే విద్యార్థులు నమ్ముతారని, వారి భవిష్యత్తు గురువులపై ఆధారపడి ఉందన్నారు. ఉపాధ్యాయుల మార్గదర్శనంతోనే తాను కలెక్టర్ కాగలిగానన్నారు. 90 శాతం మంది ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పనిచేయడం వల్లనే మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ గురుపూజోత్సవ కార్యక్రమం స్వచ్ఛమైన తెలుగు సంస్కృతిలో నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో పొందిన అనుభూతి, సంతృప్తి ఇతర ఏ వృత్తులలో పొందలేరన్నారు. జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు ప్రధానోపాధ్యాయులను, 17 మంది స్కూల్ అసిస్టెంట్లను, 18 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ తెలిపారు. అంతకుముందు విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ విద్యాశాఖాధికారి పి.అప్పారావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

కుదిపేసిన వర్షం



చోడవరం: నీట మునిగిన వరి పొలం

- తాచేరు డైవర్షన్ రోడ్డు పైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు
- నీటి ఉధృతి ఎక్కువైతే కొట్టుకుపోనున్న రహదారి
- బీఎన్ రోడ్డులో మళ్లీ నిలిచిపోనున్న రాకపోకలు



బుచ్చెయ్యపేట : వడ్డాది డైవర్షన్ రోడ్డును తాకుతూ ప్రవహిస్తున్న వరద నీరు, (ఇన్‌సెట్) వాహనదారుల అవస్థలు

బుచ్చెయ్యపేట: వాతావరణ మార్పుల కారణంగా మళ్లీ వర్షాలు మొదలు కావడంతో మండలంలో వరద నీరు పోటెత్తింది. భీమునిపట్నం–నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో విజయరామరాజుపేట వద్ద తాచేరు నది ఉధృతంగా ప్రవహిస్తోంది. తాచేరు నదిపై ఉన్న డైవర్షన్ రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహించడంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగించే వాహనదారులు నెమ్మదిగా ప్రయాణించారు. ఏ మాత్రం వర్షం ఎక్కువైనా డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయేలా ఉంది. డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోతే విశాఖపట్నం, పాడేరు, అనకాపల్లి, నర్సీపట్నం, మాడుగుల, చోడవరం తదితర ప్రాంతాలకు తిరిగే ఆర్టీసీ బస్సులతోపాటు ఇతర వాహనాల రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో వేలాదిమంది వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బంది ఎదురవుతుంది. వడ్డాది పెద్దేరు నదిపై ఉన్న డైవర్షన్ రోడ్డు వద్ద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది.

కోనాం జలాశయం నుంచి 300 క్యూసెక్కుల నీరు విడుదల

చీడికాడ: కోనాం జలాశయం నీటిమట్టం ప్రమాదస్థాయికి చేరడంతో గురువారం ఉదయం నుంచి దిగువకు ప్రధాన గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. జలాశయం ప్రమాదస్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా గురువారం ఉదయానికి 99.50 మీటర్లకు చేరుకుంది. ఇన్‌ఫ్లో భారీగా 1300 క్యూసెక్కులు ఉండడంతో ముందస్తు చర్యల్లో భాగంగా నీటిని విడుదల చేసినట్లు ఇరిగేషన్ ఏఈ జయరాం తెలిపారు. ఇన్‌ఫ్లో పెరిగినట్లయితే నీటి విడుదలను పెంచనున్నట్లు ఆయన చెప్పారు. బొడ్డేరు నదీ పరివాహక గ్రామాల ప్రజలను ఇప్పటికే అప్రమత్తం చేశామని, ఎవరూ నదిలోకి దిగవద్దని హెచ్చరించినట్లు ఆయన తెలిపారు.

పెద్దేరుకు తగ్గిన వరద పోటు

మాడుగుల: పెద్దేరు జలాశయానికి వరద పోటు తగ్గుముఖం పట్టింది. దీంతో జలాశయం అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. 400 క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో గురువారం నాటికి 100 క్యూసెక్కులకు తగ్గిపోయింది. జలాశయం గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా 136.10 మీటర్లకు చేరుకుంది. జలాశయం కేచ్‌మెంట్ ఏరియాలో 5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

నీటిపాలైన పొలాలు

చోడవరం: తుపాను వర్షాలకు చోడవరం పరిసర ప్రాంతాల్లో పొలాలన్నీ నీట మునిగాయి. రోడ్లపై ఎక్కడికక్కడ నీరు నిలిచిపోవడంతో చోడవరం–అనకాపల్లి, చోడవరం–నర్సీపట్నం ప్రధాన రహదారిపై పెద్దపెద్ద గోతులు పడి వాహనచోదకులకు ప్రాణాంతకంగా మారాయి. పట్టణంలో బాలాజీ నగర్, న్యూశాంతినగర్, చీడికాడ రోడ్డు ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్లపై ప్రవహించింది. రెల్లివీధి, కోట వీధిలో కొన్ని ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.



చోడవరం: పట్టణంలో పల్లపు ప్రాంతాలు జలమయం

ఆదిదేవుడికీ తప్పని వరద ముంపు

- నీట మునిగిన చోడవరం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి



చోడవరం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి గర్భ గుడిలో ప్రవేశించిన నీరు

చోడవరం: వరద ముంపు ఆదిదేవుడైన వినాయకుడికీ తప్పలేదు. ప్రముఖ పుణ్యక్షేత్రం చోడవరం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం గురువారం వరద ముంపులో చిక్కుకుంది. స్వామివారి ప్రధానాలయం ఏనుగుబోదు చెరువు గర్భంలో ఉండటంతో తుఫాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువు నిండిపోయింది. దీంతో స్వామివారి గర్భాలయంలోకి చెరువు ఊటనీరు రావడంతో ఆలయంలో స్వామివారి మూలవిరాట్ విగ్రహం మునిగిపోయింది. గర్భాలయంలోకి ఊరుతున్న నీటిని బయటకు పంపించేందుకు మోటార్ల సాయంతో చర్యలు చేపట్టారు. ప్రతీ ఏటా వచ్చే వరదల్లో తాను మునిగిపోతూ ఈ ప్రాంత ప్రజలను, పంటలను మాత్రం వరద ప్రమాదాల నుంచి రక్షిస్తూ స్వయంభూ విఘ్నేశుడు అందరికీ ఆరాధ్యదైవంగా బాసిల్లుతున్నారు. మరో రెండ్రోజుల్లో వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతున్న సమయంలో స్వామివారి గర్భాలయంలో నీట మునిగి ఉండటంతో దేవాదాయశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది.

వీఆర్పీలపై తప్పుడు అడ్రస్‌తో ఫిర్యాదు

- విచారణకు 28 మంది సిబ్బంది నియామకం

కె.కోటపాడు: ఉపాధి వేతనదారుల నుంచి వీఆర్పీలు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని కె.కోటపాడుకు చెందిన రతన్‌రాజ్ పేరిట నమోదైన ఫిర్యాదు నిజమైనదేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆగస్టు 28న ఆన్‌లైన్‌లో ఈ ఫిర్యాదు అందింది. విచారణకు వెళ్లిన అధికారులకు ఫిర్యాదీ ఆచూకీ లభ్యం కాలేదు. వివరాలు.. వీఆర్పీలు ఒక్కో వ్యక్తి నుంచి రోజుకు రూ.30 చొప్పున తీసుకొని కూలీల శ్రమను దోచేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక పంచాయతీ పరిధిలో 350 నుంచి 400 మంది వేతనదారుల నుంచి రోజుకు రూ.12 వేల చొప్పున ఏడాదికి రూ.43 లక్షల 20 వేలు దోపిడీ చేస్తున్నట్లు ఆ ఫిర్యాదులో తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో వీఆర్పీలు ఏడాదికి సుమారు రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకూ అవినీతికి పాల్పడుతున్నట్లు అందులో పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా డ్వామా పీడీ సందీప్ 28 మంది అధికారులతో విచారణ కమిటీ వేశారు.

తప్పుడు డోర్ నెంబర్‌తో ఫిర్యాదు

ఫిర్యాదీ రతన్‌రాజ్ కె.కోటపాడు గ్రామంలో 3–32 డోర్ నంబర్ గల ఇంట్లో ఉంటున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఇంటికి బుధవారం వెళ్లిన ఉపాధి అధికారులకు రతన్‌రాజ్ ఆచూకీ లభ్యం కాలేదు. అలాంటి వ్యక్తి ఇక్కడ ఎవ్వరూ లేరని చుట్టుపక్కలవారు చెప్పారు. ఫిర్యాదులో పేర్కొన్న ఫోన్ నెంబర్‌కు కాల్ చేసినా స్విచ్ ఆఫ్ వస్తున్నట్టు అధికారులు గుర్తించారు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫోన్ నెంబర్‌పై ఆరా తీయగా పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఒక మహిళ పేరున ఉన్నట్లు తెలిసింది. ఫిర్యాదీ కనిపించకపోవడంతో విచారణ ఏ విధంగా చేయాలని అధికారులు జుత్తు పీక్కుంటున్నారు. దీనిపై డ్వామా పీడీ సందీప్ వివరణ కోరగా.. ఆన్‌లైన్‌లో చాలా ఫిర్యాదులు వస్తాయని, అవి నిజమో కాదో తెలియాలని, దీనిపై తమ అధికారులు విచారణ చేస్తున్నారని చెప్పారు.

క్లుప్తంగా

ఘనంగా మరిడిమాంబ ఉత్సవం

కశింకోట: మండలంలోని ఏనుగుతుని గ్రామంలో గురువారం మరిడిమాంబ అమ్మవారి ఉత్సవం ఘనంగా జరిగింది. అమ్మవారిని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, పూజలు చేశారు. మహిళలు పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ వేగి గోపీకృష్ణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పెంటకోట రాము, కలగా సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


విద్యార్థులను పరీక్షిస్తున్న గైనకాలజిస్ట్ నిహారిక

కశింకోట: ఆరోగ్యం పట్ల విద్యార్థినులు శ్రద్ధ వహించాలని కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి తిరుపతిరావు సూచించారు. మండలంలోని తేగాడలో ఉన్న కేజీబీవీలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గైనకాలజిస్ట్ నిహారికతో కలిసి సుమారు 260 మంది విద్యార్థినులకు ఆయన పరీక్షలు చేశారు. హిమోగ్లోబిన్, మలేరియా, డెంగ్యూ, ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణపై పలు సూచనలు, సలహాలు అందించారు. సూపర్‌వైజర్ విజయలక్ష్మి, పారా మెడికల్ సిబ్బంది సుభాని, ఉదయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ సంతోషి, కిన్నెర విజయలక్ష్మి, విద్యాలయం సిబ్బంది చంద్రకళ, కామేశ్వరి పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి వృద్ధుల సమస్యలు

అనకాపల్లి: వృద్ధుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా దివ్యాంగుల డైరెక్టర్ బి.జగదీశ్వరరావు అన్నారు. స్థానిక గవరపాలెం వి.వి.రమణ రైతు భారతి హాల్లో గురువారం జిల్లా వయోవృద్ధుల ప్రజా సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు జారీ చేస్తామన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు, శరగడం నూకరాజు, జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 96 బెల్లం దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,100	4,200
రెండో రకం	3,400	3,500
మూడోరకం	3,300	3,350

అనకాపల్లి సినిమాలు

35.. చిన్న కథ కాదు : రాజా
ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ : సత్యనారాయణ 1
కమిటీ కుర్రోళ్లు : సత్యనారాయణ స్క్రీన్-2
సింబా : పర్తిసాయి
సరిపోదా శనివారం : షిర్డీ సాయి
డబుల్ ఇస్మార్ట్ : వెంకటేశ్వర
మారుతీనగర్ సుబ్రమణ్యం : శ్రీసత్య
డిమోంటి కాలనీ-2 : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 16 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-6, ఓ పాజిటివ్-9 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 19706లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 486 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 397 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ 0892-4223595ను సంప్రదించవచ్చు.

గురుదేవోభవ

• ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


కలెక్టర్ నుంచి పురస్కారం అందుకుంటున్న తాళ్లపాలెం హైస్కూల్ టీచర్ వై.శ్రీనివాసరావు


కశింకోట విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న సంఘం సభ్యులు


కశింకోట బాలికల హైస్కూల్‌లో టీచర్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్


కశింకోట సెయింట్ జాన్స్ స్కూలులో బాలికల నృత్య ప్రదర్శన

కశింకోట: దివంగత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని అనకాపల్లి నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కశింకోటలోని బాలికల హైస్కూల్‌లో హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారితో పాటు ఇతర ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించారు. టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్, విద్యా కమిటీ చైర్మన్ ఆళ్ల శ్రీను, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే డీపీఎస్ జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం ఆచంట రవి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులకు విద్యార్థులు పుష్పాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్‌లో విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో సందడి చేశారు. స్కూల్ డైరెక్టర్ బత్తుల అనురాధ, ప్రిన్సిపాల్ రూపానంది, ఉపాధ్యాయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

• తాళ్లపాలెం హైస్కూల్‌లో పని చేస్తున్న సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు వై.శ్రీనివాసరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ఈ మేరకు అనకాపల్లిలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో కలెక్టర్ నుంచి ఆయన పురస్కారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును హెచ్‌ఎం వై.విజయలక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ కరణం శ్రీనివాసరావు, ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది అభినందించారు.

• ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కశింకోటలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్రాంత ఉపాధ్యాయులు వేదుల వెంకట శాస్త్రి, భీమిశెట్టి శ్రీనివాసరావు, డి.ముత్యాలరావు, షేక్ హాసన్, లెక్చరర్ ఎం.సత్యనారాయణలను సంఘం సభ్యులు దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. సంఘానికి దివంగత ఉపాధ్యాయుడు కందుల శ్రీరామమూర్తి దంపతుల జ్ఞాపకార్థం రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని ఆయన కుమారుడు శివాజీ అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో నంబా రమణ, సంఘం అధ్యక్షుడు పాముల సూర్యనారాయణ, కార్యదర్శి కె.గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి: పట్టణం, మండలంలో గురువారం గురు పూజోత్సవాలు ఉత్సాహంగా జరిగాయి. స్థానిక జీవీఎంసీ పెద్ద హైస్కూల్ హెచ్‌ఎం బ్రహ్మాజీ, వేల్పులవీధి టౌన్ గర్ల్స్ హైస్కూల్ హెచ్‌ఎం రుదిరరాణిలను వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ సత్కరించారు. అనంతరం ఆయా స్కూళ్ల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొండా శంకరరావు, సుబ్రహ్మణ్యం, సోమిశెట్టి భార్గవ్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

• స్థానిక వుడ్ పేట హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి స్కూల్ కరస్పాండెంట్ గిరీష్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఏఈ మల్ల చిన్నారావు, చిన్నారులు పాల్గొన్నారు.

• గవరపాలెం యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి చీఫ్ మేనేజర్ దుర్గాప్రసాద్, బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

• గవరపాలెం కొణతాల సుబ్రమణ్య ఏసీ హాల్లో హిమశేఖర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి సంస్థ అధినేత కొణతాల జనార్దన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


జీవీఎంసీ పెద్ద హైస్కూల్‌లో మొక్క నాటుతున్న హెచ్‌ఎం బ్రహ్మాజీ, జాజుల రమేష్


విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరిస్తున్న గవరపాలెం యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు


సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హిమశేఖర్ కళాశాలల అధినేత కొణతాల జనార్దన్

సంతలో చవితి సందడి


కశింకోట వారపు సంతలో అమ్మకానికి పెట్టిన గణేష్ ప్రతిమలు


దుకాణాల్లో అమ్మకానికి ఉంచిన వినాయక చవితి పూజా సామగ్రి

కశింకోట: కశింకోటలోని వారపు సంతలో గురువారం వినాయక చవితి సందడి కనిపించింది. వేడుకలకు అవసరమైన గణనాథుని ప్రతిమల విక్రయాలు జోరుగా సాగాయి. వివిధ రూపాల్లో ఉన్న ప్రతిమలను వ్యాపారులు అమ్మకానికి పెట్టారు. సుమారు ఐదు అడుగుల ఎత్తు వరకు ఉన్న విగ్రహాలను సైజును బట్టి ధర నిర్ణయించి విక్రయించారు. దుకాణాల్లో పందిరి పాళీలు, పండ్లు, ఇతర పూజా సామగ్రి విక్రయాలు కూడా జోరుగా సాగాయి.

మాజీ ఎమ్మెల్యే రుద్రరాజు మృతికి సంతాపం


సత్యనారాయణరాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కోటేశ్వరరావు

అనకాపల్లి: సీపీఎం సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే రుద్రరాజు సత్యనారాయణరాజు మృతి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.కోటేశ్వరరావు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సత్యనారాయణరాజు చిత్ర పటానికి గురువారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ రాజు ప్రజలకు, ప్రతినిధులకు, కమ్యూనిస్టు పార్టీ నేతలకు ఆర్ఎస్‌గా సుపరిచితులన్నారు. పీడిత ప్రజల విముక్తి కోసం, శ్రామిక వర్గ రాజ్యం కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పార్టీని బలోపేతం చేయడంలో క్రియాశీలకంగా వ్యవహరించారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ఆర్.శంకరరావు, వి.వి.శ్రీనివాసరావు, అల్లు రాజు, కె.ఈశ్వరరావు, బి.ఉమామహేశ్వరరావు, డి.డి.వరలక్ష్మి, పి.చలపతి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయానికి ఫర్నిచర్ వితరణ


ఆఫీస్ ఫర్నిచర్‌తో పాటు పోలీస్ లోగోను ఎస్పీ ఎం.దీపికకు అందిస్తున్న హనీ రిజ్వాస్

అనకాపల్లి: పరవాడలో మ్యాన్ కైండ్ ఫార్మా కంపెనీ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులతో స్థానిక ఎస్పీ కార్యాలయానికి గురువారం ఆఫీస్ ఫర్నిచర్‌ను అందజేసింది. ఈ మేరకు ఎస్పీ ఎం.దీపికకు లోగోతో పాటు ఫర్నిచర్‌ను డిప్యూటీ మేనేజర్ హనీ రిజ్వాన్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ మేరకు ఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారుల అందరికి విజిటర్స్ చైర్స్, ఎగ్జిక్యూటివ్ చైర్స్, ఏసీలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మా కంపెనీ డీజీఎం సురేష్, అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, సీఐలు లక్ష్మణమూర్తి, బాల సూర్యారావు, వినోద్ బాబు, ఎస్ఐ రఘువర్మ పాల్గొన్నారు.

బకాయిల కోసం వెలుగు వీవోఏల ఆందోళన


జీతాలు చెల్లించాలని డీఆర్‌వో దయానిధికి వినతిపత్రం అందిస్తున్న వెలుగు నాయకులు

అనకాపల్లి: డ్వాక్రా సంఘాలను ఆర్గనైజ్ చేస్తున్న వెలుగు వీవోఏలకు 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని డ్వాక్రా సంఘాల (సీఐటీయూ)గౌరవాధ్యక్షుడు వి.వి.శ్రీనివాసరావు ఆరోపించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద గురువారం సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం డీఆర్‌వో దయానిధి, డీఆర్‌డీఏ పీడీ చంపావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఎలా జీవనం సాగిస్తారోనన్న కనీసమైన ఆలోచన కూడా ప్రభుత్వానికి లేకపోవడం దారుణమన్నారు. మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్‌తో వీవోఏలు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీవోఏల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సిహెచ్.రూపాదేవి, వీవోఏ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.సూరిబాబు, జిల్లా నాయకులు వై.లక్ష్మి, రాము, పుష్ప, భవాని, దమయంతి, రమణ, పద్మ, సత్యం, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు ఎరువు తయారీ


సంపద తయారీ కేంద్రంలో వానపాములు విడిచిపెడుతున్న గున్నయ్యనాయుడు

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెంలో ఉన్న సంపద తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్టు ఎరువు తయారీ గురువారం చేపట్టారు. దీనిలో భాగంగా ఎరువు తయారీకి ఉపయోగపడే వానపాములను కుండీల్లో వేశారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు సరకుల తరలింపు


విజయవాడ వరద బాధితులకు సరకులు పంపిస్తున్న తహసీల్దార్ వై.శ్రీరామమూర్తి

అనకాపల్లి: విజయవాడలో తుపాన్ బాధితులకు నిత్యావసర సరకులను ప్రభుత్వ ఆదేశాల మేరకు పంపించినట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ వై.శ్రీరామమూర్తి తెలిపారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి గురువారం రాత్రి రూ.5 లక్షల విలువైన నిత్యావసర సరకులను రెండు వ్యాన్లతో పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ప్యాకెట్లు, బిస్కెట్లు, వాటర్ బాటిళ్లు, నిత్యావసర సరకులు పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమేష్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

మిస్టర్ టీన్ ఇండియాకు ఘన సత్కారం


మిస్టర్ టీన్ ఇండియా విజేత ఆదిత్యనాయుడును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యలమంచిలి రూరల్: మోడలింగ్‌లో రాణిస్తూ మిస్టర్ టీన్ ఇండియా-2024 విజేతగా నిలిచిన యలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామానికి చెందిన శానాపతి ఆదిత్య నాయుడిని గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. యలమంచిలిలో మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, కౌన్సిలర్లు పిట్టా సత్తిబాబు, దూది నర్సింహమూర్తి, సయ్యద్ బీబీ, కిరణ్, తదితరులు దుశ్శాలువతో ఆదిత్యనాయుడిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుగ్రామం నుంచి మోడలింగ్‌లో రాణిస్తూ జాతీయ స్థాయిలో విజేతగా నిలవడం చాలా గొప్ప విషయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్లి వెంకట్, కొల్లి త్రినాథరావు, పిల్లా త్రినాథ్, వీసం బంగారి, జోజుబాబు, అంకిరెడ్డి నర్సింగరావు, దాసరి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కిన నిత్యావసర ధరలు

కశింకోట: కశింకోట వారపు సంతలో గురువారం నిత్యావసర సరకుల ధరలు కొండెక్కాయి. ఉల్లిపాయ కిలో రూ.60కి విక్రయించారు. టమాటా, బంగాళా దుంప, దొండకాయ, బీట్‌రూట్, క్యారెట్, వంకాయ, బెండకాయ రూ.40, బీరకాయ రూ.50, గోరు చిక్కుడు, చేమదుంప రూ.60, చిక్కుడు, క్యాప్సికం కిలో రూ.80 చొప్పున విక్రయాలు సాగాయి.

నేడు వినాయక ఆలయ వార్షికోత్సవం

కశింకోట: కశింకోటలోని ఉప్పునీటి దిబ్బ వద్ద కొలువైన వినాయక ఆలయ వార్షికోత్సవం శుక్రవారం జరగనుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపడతామని తెలిపారు.

కశింకోటలో భారీ వర్షం

కశింకోట: కశింకోటలో గురువారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షం వల్ల పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండల పరిషత్ కార్యాలయం, పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డులో నీరు చేరి రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఆర్టీసీ బస్ స్టేషన్ బురదమయంగా మారింది. ఈ వర్షం వరి నాట్లుకు బాగా ఉపకరిస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువులు వరద నీటితో కళకళలాడుతున్నాయి.

ఎన్టీపీసీ ఎన్నికల్లో ఎన్ఎస్‌డబ్ల్యూయూ గెలుపు


విజయం సాధించిన ఎన్ఎస్‌డబ్ల్యూయూ కార్యవర్గం

పరవాడ: ఎన్టీపీసీ సింహాద్రి గుర్తింపు యూనియన్‌కు గురువారం జరిగిన ఎన్నికల్లో ఎన్టీపీసీ సింహాద్రి వర్కర్స్ యూనియన్(ఎన్ఎస్‌డబ్ల్యూయూ) విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో బండారు శ్రీధర్‌నాయుడు అధ్యక్షుడిగా, గంప శంకరవర్మ జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. మొత్తం 197 ఓట్లలో ఎన్టీపీసీ సింహాద్రి వర్కర్స్ యూనియన్‌కు 117 ఓట్లు రాగా, ప్రత్యర్థి వర్గానికి 80 ఓట్లు పోలయ్యాయి. 37 ఓట్ల తేడాతో ఎన్ఎస్‌డబ్ల్యూయూ గెలుపొందింది. విజేతలను పరవాడ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు అభినందించారు.

ఆరోగ్యకరమైన మాంసాన్నే విక్రయించాలి


మాట్లాడుతున్న రామకృష్ణకీర్తి

పరవాడ: ప్రజల ఆరోగ్యం దృష్ట్యాపరిశుభ్రమైన మాంసం విక్రయాలను జరపాలని పరవాడ పశు సంవర్ధకశాఖ ఏడీ రామకృష్ణకీర్తి సూచించారు. స్థానిక పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో మాంసం విక్రయాలపై సంబంధిత విక్రయదారులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యంగా ఉన్న మేకలు, గొర్రెలు, కోళ్లను మాత్రమే ప్రజలకు విక్రయించాలన్నారు. మాంసం విక్రయ ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. మేకలు, గొర్రెలు, కోళ్లను పంచాయతీ అధికారులు పరిశీలించి, ఆమోద ముద్ర వేశాకే వధించాలన్నారు. జంతు కళేబరాలను నివాసాలకు దూరంగా ఖననం చేయాలని సూచించారు. పరవాడ, రావాడ సర్పంచులు సిరపరపు అప్పలనాయుడు, మోటూరి సన్యాసినాయుడు, పెదముషిడివాడ ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావు, పరవాడ ఎంపీడీవో హేమసుందరరావు, పశువైద్యాధికారులు సురేష్‌కుమార్, అశ్విని, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

మండల ప్రత్యేకాధికారి లక్ష్మి


అధికారులకు సూచనలు చేస్తున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మి

నాతవరం: మండలంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి అధికారులు దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి జి.వి.లక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండవద్దని సూచించారు. తుపాను నష్టాలను శాఖల వారీగా నివేదించాలన్నారు. సంక్షేమ, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులను సచివాలయాల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తాగునీటి పథకాల్లో క్లోరినేషన్ చేయడంతో పాటు డ్రైనేజీలను శుభ్రం చేయించాలని చెప్పారు. పాఠశాలల్లో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించాలని, వ్యాధులు ప్రబలకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలలు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ఆకస్మికంగా తనిఖీలు చేయాలని చెప్పారు. సచివాలయ ఉద్యోగుల సమయ పాలన విషయంలో ఎంపీడీవో ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష తగదు


అవగాహన కల్పిస్తున్న లింక్ వర్కర్ స్కీం సూపర్‌వైజర్ చందు

రోలుగుంట: ఎయిడ్స్ వ్యాధి గ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం సూపర్‌వైజర్ చందు తెలిపారు. ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ , జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో కొవ్వూరులో గురువారం ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. మండల కౌన్సెలర్ మలసాల గణేష్, హెచ్‌ఎం దేముడుబాబు, పీహెచ్‌సీ సిబ్బంది కన్నబాబు, ఎంఎల్‌పీహెచ్ నూకరత్నం, మహిళా సంరక్షణ కార్యదర్శి గొల్లు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.